క్లుప్తంగా

జీఎస్ఐతో ఏయూ ఒప్పందం



జీఎస్ఐ ప్రతినిధులతో ఎంవోయూ పత్రాలు మార్చుకుంటున్న ఏయూ వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధన, అభివృద్ధి రంగంలో మరో ముందడుగు వేసింది. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ)తో ఏయూ శనివారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ సమక్షంలో ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఏయూ తరఫున రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె. రాంబాబు, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సత్య నారాయణ మహాపాత్రో సంతకాలు చేశారు. కార్యక్రమంలో భారత ప్రభుత్వం నుంచి వచ్చిన ఇతర ప్రతినిధులు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎంవీఆర్ రాజు, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య ఇఎస్ ధనుంజయ రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

ఆరిలోవ : బీఆర్‌టీఎస్‌లో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సింహాచలం నుంచి హనుమంతవాక వైపు శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనంతో ఓ యువకుడు వెళ్తున్నాడు. హెల్త్ సిటీ క్యూ1 ఆస్పత్రి వద్దకు చేరేసరికి... అదే సమయంలో ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న బంధువును పరామర్శించడానికి కొందరు మహిళలు దీన్‌దయాళ్‌పురం వద్ద రోడ్డు దాటారు. వారిలో ఓ వృద్ధురాలు ఆ యువకుడు నడుపుతున్న ద్విచక్ర వాహనానికి అడ్డం పడింది. దీంతో ఆకస్మాత్తుగా బైక్ బ్రేక్ వేసిన యువకుడు కింద పడడంతో చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. బైక్‌కు అడ్డం పడిన వృద్ధురాలికి స్వల్ప గాయాలయ్యాయి. ఆ సంఘటన చూసిన స్థానికులు వెంటనే స్పందించి గాయాలపాలైన యువకుడిని హెల్త్‌సిటీలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి పోలీసులకు సమాచారం అందించారు.

తోపుడు బళ్లు అందజేత

ఆరిలోవ : జీవీఎంసీ పదమూడో వార్డులో పారిశుధ్య కార్మికులకు జీవీఎంసీ తోపుడు బళ్లు పంపిణీ చేసింది. వాటిని వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికులకు ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. తోపుడు బళ్లతో వీధుల్లో తిరిగి పరిసరాలు శుభ్రం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

18వ వార్డులో భారీ అన్నసమారాధన



అమ్మవారి సన్నిధిలో శ్రీ జయదుర్గా బాయ్స్ సభ్యులు, ఉమ్మిడి కల్యాణ్, తదితరులు

ఎంవీపీ కాలనీ : శ్రీ జయ దుర్గా బాయ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ 18వ వార్డు మూలపాలెంలో శనివారం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. శ్రీదుర్గాదేవి శరన్నవరాత్రులను పురస్కరించుకుని కొన్ని రోజులుగా పూజలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ 18వ వార్డు అధ్యక్షుడు ఉమ్మిడి కల్యాణ్ పాల్గొని శ్రీ జయ దుర్గా బాయ్స్ సభ్యులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అరుదైన ఏసీఎల్ శస్త్రచికిత్స విజయవంతం



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ శ్రీధర్, తదితరులు

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ మెడికవర్ వైద్యులు మరో అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ వివరాలను శనివారం ఆస్పత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్, ఇండియన్ ఆర్థోస్కోపిక్ సొసైటీ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ శ్రీధర్ గంగావరపు వివరించారు. ఏడాదికాలంగా తీవ్రమైన మోకాలి నొప్పితో 23 ఏళ్ల యువ క్రీడాకారుడు మెడికవర్ ఆస్పత్రిలో చేరాడని... ఎంఆర్ఐ స్కాన్‌లో అతనికి లూజ్‌లిగమెంట్స్ ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. దీంతో అరుదైన యాంటీరియల్ క్రూసియేట్ లిగమెంట్ (ఏసీఎల్) శస్త్రచికిత్స చేశామన్నారు. దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా ఎంవీపీ కాలనీ మెడికవర్ హాస్పిటల్‌లో విజయవంతంగా ఈ శస్త్రచికిత్స పూర్తి చేసినట్లు తెలిపారు. వేగవంతమైన రికవరీ ఉండే బయో సపోర్ట్ మెటీరియల్‌తో శస్త్రచికిత్స చేసినట్లు వెల్లడించారు. మెడికవర్ ఎంవీపీ కాలనీ సెంటర్ హెడ్ డాక్టర్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.



దీన్‌దయాళ్‌పురంలో ఫుట్‌పాత్‌పై విక్రయానికి వ్యాపారులు నిల్వ చేసిన ఇటుకలు, తుక్కు సామగ్రి



చినగదిలిలో సర్వీస్ రోడ్డుపై నిలిపిన వాహనాలు



సింహగిరి కాలనీలో ప్రాథమిక పాఠశాల గోడ అంచున ఫుట్‌పాత్‌పై నిల్వ చేసిన ఇసుక, టెంట్‌హౌస్ సామగ్రి



క్రాంతినగర్ వద్ద ఫుట్‌పాత్‌పై వెల్డింగ్ పనులు చేస్తున్న దృశ్యం

సర్వీస్ రోడ్లన్నీ ఫుల్

- వాహనాల పార్కింగ్, చిరు వ్యాపారుల ఆక్రమణలతో వాహనదారులకు అవస్థలు
- హనుమంతవాక నుంచి పెదగదిలి మీదుగా దీన్‌దయాళ్‌పురం వరకూ ఇదే దుస్థితి
- పార్కింగ్ సదుపాయం లేక కొండవాలు నివాసుల వాహనాలన్నీ సర్వీస్ రోడ్లులోనే నిలిపివేత
- మరోవైపు ఫుట్‌పాత్‌లను చిరు వ్యాపారులు ఆక్రమించడంతో రాకపోకలకు అవస్థలు
- బీఆర్‌టీఎస్ గ్రీన్‌బెల్ట్‌లో పార్కింగ్ సదుపాయం కల్పించాలని కోరుతున్న కొండవాలు ప్రాంత నివాసులు

ఆరిలోవ : బీఆర్‌టీఎస్‌ను ఆనుకుని సర్వీస్ రోడ్లు వాహనాలతో నిండిపోతున్నాయి. ఫలితంగా వాహనచోదకులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. కొండవాలు ప్రాంత వాసుల వాహనాలు నిలుపుకోవడానికి ఇక్కడ స్థలం లేకపోవడంతో ఏళ్ల తరబడి రోడ్లపైనే పార్కింగ్ చేస్తూ ఇబ్బంది పడుతున్నారు. ప్రత్యేకంగా బీఆర్‌టీఎస్ గ్రీన్‌బెల్ట్‌లో పార్కింగ్ సదుపాయం కల్పించాలని ఏళ్ల తరబడి చేస్తున్న కొండవాలు వాసుల విన్నపాలు అధికారులను కదిలించలేకపోతున్నాయి. మరోవైపు సర్వీస్ రోడ్లను ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్‌లను ఇటుకలు, ఇసుక విక్రయాలు, వెల్డింగ్ పనుల కోసం చిరు వ్యాపారులు ఆక్రమించేయడంతో స్థానికుల రాకపోకలకు మరింత ఇబ్బందికరంగా మారింది. అటువంటి ఆక్రమణదారులపై జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టడం లేదు. హనుమంతవాక నుంచి సింహగిరి కాలనీ, సంజయ్‌గాంధీ కాలనీ, పెదగదిలి, చినగదిలి, దీన్‌దయాళ్‌పురం వరకు కొండవాలు ప్రాంతవాసులు తమ వాహనాలను సర్వీస్ రోడ్లపైనే నిలుపుతున్నారు. వీరికి ఇక్కడ ప్రత్యేకంగా పార్కింగ్ సదుపాయం లేదు. దీంతో నివాసితుల ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, క్యాబ్‌లు ఈ సర్వీస్ రోడ్లపైనే నిలపాల్సి వస్తోంది. ఫలితంగా ఇతర వాహనదారుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది.

చిరు వ్యాపారుల ఆక్రమణలో ఫుట్‌పాత్‌లు

బీఆర్‌టీఎస్‌లో సర్వీస్ రోడ్లను ఆనుకుని కొన్నిచోట్ల నిర్మించిన పాత్‌వేలు ఆక్రమణకు గురయ్యాయి. చిరు వ్యాపారులు వాటిని ఆక్రమించి దర్జాగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీంతో ఆ రహదారిలో వాహనచోదకులు వాహనాలు నడపడానికి ఇబ్బంది పడుతున్నారు. పాదచారులు పాత్‌వేపై నడవడానికి కూడా వీలుపడడం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పాత్‌వేలన్నీ పూర్తిస్థాయిలో ఆక్రమణకు గురయ్యాయి. వీటిపై కొన్నిచోట్ల చిరు వ్యాపారులు టీ దుకాణాలు, వెల్డింగ్ షాపులు నిర్వహిస్తున్నారు. ఇంకొన్ని చోట్ల కార్లు, ఆటోలు నిలుపుతున్నారు. మరికొన్ని చోట్ల అయితే గృహ నిర్మాణ సామగ్రి నిల్వ చేస్తుండగా... కొందరు తుక్కు, టెంట్‌హౌస్ వ్యాపారాల సామగ్రి నిల్వ చేసుకుంటున్నారు. ఫలితంగా పాదచారుల కోసం ఏర్పాటు చేసిన పాత్‌వేలు ఆక్రమణదారులకు ఉపయోగపడుతున్నాయి. దీన్‌దయాళ్‌పురం నుంచి చినగదిలి వరకు తుక్కు వ్యాపారులు పాత్‌వేను వినియోగించుకుని సామగ్రి అడ్డంగా నిల్వ చేస్తున్నారు. సంజయ్‌గాంధీ కాలనీ, సింహగిరి కాలనీ, క్రాంతినగర్ వద్ద తుక్కు వ్యాపారులు, వెల్డింగ్ షాపులు, టెంట్ హౌస్‌ల వ్యాపారులు వారి సామగ్రిని ఫుట్‌పాత్‌లపైనే నిల్వ చేస్తున్నారు. కొందరు గృహ నిర్మాణ సామగ్రిని సైతం నిల్వ చేయడానికి ఈ ఫుట్‌పాత్‌లనే వినియోగించుకుంటున్నారు. దీంతో పాదచారులు వాటిపై నడవడానికి వీలుపడడం లేదు.



దీన్‌దయాళ్‌పురం వద్ద సర్వీస్ రోడ్డులో నిలిపిన వాహనాలు..., మరోవైపు ఫుట్‌పాత్‌పై కార్లు

పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేస్తేనే...

హనుమంతవాక నుంచి అడవివరం వరకు జీవీఎంసీ 2008లో 9 కిలోమీటర్ల బీఆర్‌టీఎస్ నిర్మాణం చేపట్టింది. అప్పటికి 40 అడుగుల వెడల్పుతో ఉన్న ఇరుకు రహదారిని విస్తరించి 200 అడుగులతో ఐదు లైన్‌లతో నిర్మాణం చేపట్టారు. హనుమంతవాక నుంచి దీన్‌దయాళ్‌పురం వరకు సుమారు మూడున్నర కిలోమీటర్ల మేర కొండవాలు ప్రాంతం ఉంది. ఈ ప్రాంతంలో సుమారు 10 వేలకు పైగా నివాసాలున్నాయి. ఆయా నివాసితుల వాహనాలు నిలుపుకోవడానికి ఇక్కడ ప్రత్యేకంగా పార్కింగ్ సదుపాయం కల్పించలేదు. బీఆర్‌టీఎస్‌కు కొండవాలు వైపు సర్వీస్ రోడ్డు మధ్యలో గ్రీన్‌బెల్ట్ కోసం కొంత ఖాళీ స్థలాన్ని అధికారులు విడిచిపెట్టారు. దీనిలో మొక్కలు నాటి పచ్చదనం కల్పించాలని ఆలోచించారు. ఈ గ్రీన్ బెల్ట్‌లో పలుచోట్ల నిర్మాణాలు జరిగాయి. దీన్‌దయాళ్‌పురం నుంచి పెదగదిలి వరకు గ్రీన్ బెల్ట్‌లో పలుచోట్ల ఆలయాలు నిర్మించేశారు. పెదగదిలి ప్రాథమిక పాఠశాల కూడా ఈ గ్రీన్ బెల్ట్‌లోనే నిర్మించారు. దీంతో గ్రీన్‌బెల్ట్ లక్ష్యం పక్కదారి పట్టింది. అదే గ్రీన్‌బెల్ట్‌లోనే వెడల్పుగా ఉన్నచోట్ల పార్కింగ్ కూడా ఏర్పాటు చేసుకునే వెసులుబాటు ఉంది. అలా చేస్తే కొండవాలు వాసుల వాహనాలు పార్కింగ్ స్థలంలో నిలుపుకోవడానికి వీలుకలుగుతుందని స్థానికులు భావిస్తున్నారు. కొండవాలు వాసులకు వారి వాహనాలు నిలుపుకోవడానికి పార్కింగ్ స్థలాలు కేటాయించాలని కోరుతున్నారు. సంజయ్‌గాంధీ కాలనీ వద్ద షిర్డీ సాయిబాబా ఆలయం ముందు నుంచి సచివాలయం వరకు విశాలమైన ఖాళీ స్థలం ఉంది. దీంతోపాటు సింహగిరికాలనీ, పెదగదిలి నుంచి చినగదిలి వరకు, దీన్‌దయాల్‌పురం వద్ద గ్రీన్ బెల్ట్‌లో పార్కింగ్ స్థలాలు కేటాయిస్తే వాహనాలు నిలుపుకోవడానికి వీలుపడుతుందని కోరుతున్నారు. అధికారులు ఆ దిశగా అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



సింహగిరి కాలనీలో ప్రాథమిక పాఠశాల ముందు సర్వీస్ రోడ్డులో నిలిపిన వాహనాలు



పెదగదిలిలో సర్వీస్ రోడ్డులో వాహనాల బారులు

నాణ్యతా ప్రమాణాలపై అవగాహన కల్పించాలి

ఏయూ క్యాంపస్ : నాణ్యత ప్రమాణాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (విజయవాడ ప్రాంతీయ శాఖ), ఏయూ సంయుక్తంగా శనివారం ఉదయం నిర్వహించిన వాక్‌థాన్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. దైనందిన జీవితంలో, వాణిజ్య పరమైన అవసరాల్లో బీఐఎస్ ప్రమాణాల ప్రాముఖ్యతను వివరించారు. హెల్మెట్, హాల్‌మార్క్ బంగారు ఆభరణాలు, సీఆర్ఎస్ ఉన్న ఎలక్ట్రానిక్ ఉత్పత్తులపై తప్పనిసరిగా బీఐఎస్ ప్రమాణాలు ఉపయోగించాలని వివరించారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ నిర్మాణ సామగ్రిలో ప్రమాణాలు పాటించడం, ఆవశ్యకతలను వివరించారు. అలాగే సీఆర్ఎస్ గుర్తింపు కలిగిన ఎలక్ట్రానిక్ ఉత్పత్తులను వినియోగించాలన్నారు. బీఐఎస్ విజయవాడ ప్రాంతీయ కేంద్రం డైరెక్టర్ ప్రేమ సజని పట్నాలా మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి సాధించడంలో ప్రమాణాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం 2025 చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రపంచంలోనే అతిపెద్ద బొటనవేలి ముద్రలతో తీర్చిదిద్దిన బ్యానర్‌తో ప్రపంచ రికార్డును సాధించారు. కార్యక్రమంలో ఏయూ నోడల్ అధికారి ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణ రెడ్డి, బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ కె.సాయి కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నగర సీపీ శంఖబ్రత బాగ్చి

ఇంటింటికీ కూటమి ప్రభుత్వ మోసాలు

ఆరిలోవ : జీవీఎంసీ పదో వార్డులో శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. పార్టీ వార్డు అధ్యక్షుడు పతివాడ కనకరాజు ఆధ్వర్యంలో వార్డు పరిధి సుందర్‌నగర్ కొండవాలులో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాలపై ముద్రించిన కరపత్రాలను అందించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రస్తుతం కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. హామీల అమలులో పూర్తిగా విఫలమయ్యారని, కూటమి ప్రభుత్వానికి ప్రజలంతా తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రామకృష్ణ, ముద్దాడ కృష్ణ, పతివాడ వెంకటలక్ష్మి, ఇట్ల వరలక్ష్మి, కుమారి, బి.టి.నాయుడు, కంటుబోతు తులసి, రవీంద్ర, సంతోష్, సాయి, సంపత్, పాల్గొన్నారు.



పదో వార్డు సుందర్‌నగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జియోలాజికల్ మ్యూజియం సందర్శనకు అనుమతి

మద్దిలపాలెం : జియోలాజికల్ మ్యూజియం సందర్శనకు సంబంధించిన ప్రత్యేక బ్రోచర్‌ను ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ శనివారం విడుదల చేశారు. నగరంలోని పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు జియోలాజికల్ మ్యూజియంను దర్శించే వీలు కల్పిస్తామని తెలిపారు. ఈ మ్యూజియం సందర్శనకు ప్రతీ శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అనుమతిస్తామని తెలిపారు.

విదేశీ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెంచాలి

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విదేశీ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెంచాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. శనివారం ఏయూ పాలకమండలి సమావేశ మందిరంలో నిర్వహించిన శతాబ్ది ఉత్సవాల నిర్వహణ సలహా కమిటీ సమావేశంలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశాల్లో పనిచేసే ఆచార్యులను ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఆహ్వానించాలని, వారితో ప్రత్యేక ప్రసంగాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన కోర్సులను ప్రవేశపెట్టాలని, అవసరమైన మార్పులు చేయాలన్నారు. పూర్వ విద్యార్థుల సహకారం స్వీకరిస్తూ మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. అదేవిధంగా అంతర్జాతీయ ప్రమాణాలతో పరిశోధనలు జరిపేలా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. అనంతరం వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. క్లస్టర్ విభాగాలుగా నిర్వహించే కార్యక్రమాల వివరాలను త్వరలోనే విడుదల చేస్తామని చెప్పారు. పైలాన్ నిర్మాణం, క్రీడా కార్యక్రమాలకు దిశ నిర్దేశం చేశారు.



శతాబ్ది ఉత్సవాల సలహా కమిటీ సమావేశంలో సీపీ శంఖబత్ర బాగ్చి, వీసీ రాజశేఖర్

డిస్ట్రిక్ట్ వెటరన్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోస్టర్ ఆవిష్కరణ

ఎంవీపీ కాలనీ : విశాఖలో జరగనున్న డిస్ట్రిక్ట్ వెటరన్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ – 2025 పోస్టర్‌ను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శనివారం ఆవిష్కరించారు. పోటీలను ఈ నెల 26 నుంచి విశాఖ పోలీస్ బ్యారెక్స్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు సంస్థ ఛైర్మన్ డాక్టర్ కమల్ బయిద్ తెలిపారు. వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ విశాఖపట్నం (వీఏఏవీ) ఆధ్వర్యంలో పోటీలు జరుగుతాయన్నారు. 5 కిలోమీటర్ల వాకింగ్‌తోపాటు 100, 200, 400, 800, 1500, 4000 మీటర్ల పరుగు పందెం, ట్రిపుల్ జంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్క్‌త్రో, జావెలిన్ త్రో, హేమర్ త్రో తదితర క్రీడా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 30 నుంచి 34 సంవత్సరాలు పైబడిన స్త్రీ, పురుషులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఆసక్తి గల వారు 97013 47311, 83091 57522లో సంప్రదించి ఈ నెల 20లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు డిసెంబర్ 13, 14న గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వావ్ అధ్యక్షుడు డాక్టర్ మంగ వరప్రసాద్, చింతలపాటి వంశీకృష్ణ వర్మ, కోశాధికారి ఎం.రామారావు పాల్గొన్నారు.

ఉద్యమంలా కోటి సంతకాల సేకరణ

వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు

మద్దిలపాలెం : మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణను ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను సీతమ్మధారలో గల పార్టీ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన కొత్త మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించి పేదలకు వైద్యాన్ని, వైద్య విద్యను దూరం చేయాలని కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. చంద్రబాబు ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంతకాల సేకరణలో నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని ప్రజలందరినీ భాగస్వాములను చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యశాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పేర్ల విజయ చందర్, రాష్ట్ర ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి రాజబాబు, సీనియర్ నాయకులు గొలగాని శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముచ్చల సురేష్, రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షుడు కంట్రెడ్డి రామన్న పాత్రుడు, కార్యదర్శి చొక్కర శేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు నడింపల్లి కృష్ణంరాజు, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, రాష్ట్ర వలంటీర్ విభాగం ప్రధాన కార్యదర్శి పులగం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర గ్రీవెన్స్ విభాగం ప్రధాన కార్యదర్శి సత్తి మందారెడ్డి, పీతల గోవింద్, రాష్ట్ర సోషల్ మీడియా విభాగం కార్యదర్శి బెవర జగదీష్, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి గుడ్ల గణేష్ రెడ్డి, రాష్ట్ర చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి వానపల్లి ఈశ్వరరావు, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు బోండా ఉమామహేశ్వరరావు, జిల్లా ఇంటలెక్చువల్ విభాగం అధ్యక్షుడు దేవరకొండ మార్కండేయులు, జిల్లా కార్యదర్శి బోండా శ్రీనివాస్, తూర్పు మహిళ విభాగం అధ్యక్షురాలు కె.శిరీష, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మొల్లి అప్పారావు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

దుర్గాదేవికి పూజలు



అమ్మవారి సన్నిధిలో మొల్లి అప్పారావు, తదితరులు

మద్దిలపాలెం : జీవీఎంసీ 23వ వార్డు చైతన్యనగర్ సూపర్ బాయ్స్ ఆధ్వర్యంలో శ్రీ దుర్గాదేవి నవరాత్రుల సందర్భంగా మహా అన్నదానం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కమిటీ సభ్యులు, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి గుడ్ల గణేష్ రెడ్డి, రాష్ట్ర వలంటీర్ విభాగం ప్రధాన కార్యదర్శి పులగం శ్రీనివాస రెడ్డి, 23వ వార్డు ఇన్‌చార్జి పులగం సూర్యనారాయణ రెడ్డి, వార్డు అధ్యక్షుడు బూస రమణరెడ్డి పాల్గొన్నారు.

డిసెంబర్ 6న కార్తీక్ లైవ్ షో

బీచ్‌రోడ్డు : ప్రముఖ గాయకుడు, స్వరకర్త కార్తీక్ లైవ్ అభిమానులకు లైవ్ షోలతో మ్యూజిక్ మాయాజాలాన్ని అందించడానికి డిసెంబరు 6న నగరానికి రానున్నారని ట్రైబ్ వైబ్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రతినిధి షోవెన్ షా తెలిపారు. కార్తీక్ తన చార్ట్ – టాపింగ్ హిట్‌లు ప్రేక్షకులకు నేరుగా అందిస్తారని పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో శనివారం మాట్లాడుతూ ఈ ఏడాది నవంబర్ 30 నుంచి దక్షిణ భారతదేశంలోని పది నగరాల్లో లైవ్ షోలు నిర్వహిస్తారని తెలిపారు.

కాలువలో చెత్త తొలగింపు

బీచ్‌రోడ్డు : జీవీఎంసీ 20వ వార్డులోని పెదవాల్తేరు గాంధీ సెంటర్‌లో గల కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను జీవీఎంసీ సిబ్బంది శనివారం తొలగించారు. చెత్త పేరుకుపోవడంతో కాలువలో నీరు నిలిచిపోతోందని, దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు కార్పొరేటర్ ముచ్చల లక్ష్మి సురేష్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె జీవీఎంసీ అధికారులతో మాట్లాడగా సిబ్బంది కాలువలో చెత్తను శనివారం తొలగించారు. కొత్త కాలువ నిర్మాణం కోసం అంచనాలు సిద్ధం చేయాలని అధికారులకు ఏఈ సూచించారు. వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు యనమరెడ్డి కుమార్ రెడ్డి పనులను పరిశీలించారు.

బాలికలను ప్రోత్సహించాలి

ఏయూ క్యాంపస్ : సమాజంలో బాలికల సంరక్షణ బాధ్యత ప్రతీ ఒక్కరిపైనా ఉందని ప్రముఖ వైద్యురాలు పద్మిని దేవి అన్నారు. బీచ్‌రోడ్డులోని జీవీపీ ఎంఎల్‌బీటీ పాఠశాలలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ బాలికల దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికలకు మంచి పోషకాహారం అందించడం ఎంతో అవసరమన్నారు. సమాజంలో బాలికలను ప్రోత్సహిస్తూ, సమాన అవకాశాలు అందించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల విద్య, వైద్యం, పోషకాహారం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయన్నారు. జీవీపీ కార్యదర్శి ఆచార్య పి.సోమరాజు మాట్లాడుతూ విద్యతో బాలికలు ఉన్నతంగా రాణించాలన్నారు. ఉన్నత విద్యలో ప్రవేశించే బాలికల సంఖ్య ఇటీవల గణనీయంగా పెరుగుతోందన్నారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ శివాని, బి.ప్రవల్లిక, బి.లేఖ, బి.సాయి, ఎం.సుచిత్ర, జి.దివ్య, బి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



ఐ అండ్ పీఆర్ డైరెక్టర్ విశ్వనాథన్‌ను సన్మానిస్తున్న ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ సభ్యులు

విశాఖ సిటీ: రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఐ అండ్ పీఆర్ నూతన డైరెక్టర్‌గా నియమితులైన కె.విశ్వనాథన్‌ను ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ కార్యవర్గం కోరింది. శనివారం వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షుడు పి.నారాయణ, కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు బి.శివప్రసాద్‌లు నూతన డైరెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం జర్నలిస్టులకు సంబంధించిన పలు అంశాలను డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర పూర్తికావస్తున్నా ఇప్పటికీ జర్నలిస్టులకు నూతన అక్రిడేషన్లు మంజూరు కాలేదన్నారు. అలాగే చిన్న, మధ్యతరహా పత్రికలకు సంబంధించి తాజా జీవో ప్రకారం కొద్దిగా మార్పులు చేయాల్సి ఉందని తెలిపారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని, ఇతర రాష్ట్రాల మాదిరిగా పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరారు. దీనిపై నూతన డైరెక్టర్ విశ్వనాథన్ సానుకూలంగా స్పందించారు. తన పరిధి మేరకు జర్నలిస్టులకు సంబంధించిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. సోమవారం అమరావతిలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిపారు.

అద్భుతం.. నృత్యోత్సవం

మద్దిలపాలెం: కళాభారతిలో పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చిన్న సత్యం 96వ జయంతిని పురస్కరించుకుని విశాఖ ఆర్ట్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ , వెంపటి చిన్న సత్యం స్థాపించిన కూచిపూడి కళాక్షేత్రం సంయుక్తంగా రెండు రోజుల ఆంధ్రప్రదేశ్ శాస్త్రీయ సంప్రదాయ నృత్యం, కూచిపూడి వెంపటి జయంతి నృత్యోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభించారు. తొలి రోజు కార్యక్రమంలో సుమారు 400 మంది చిన్నారులు తమ నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను అబ్బురపరిచారు. నగరంలో గల నాట్య గురువులందరి సహకారంతో ఈ కార్యక్రమం అద్భుతంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సెంచురియన్ యూనివర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, వీఎండీఏ అధ్యక్షుడు ఎంఎస్ఎన్ రాజు, విజయనిర్మాణ్ అండ్ కంపెనీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సూరపనేని విజయ్ కుమార్, విజయనిర్మల కంపెనీ చైర్మన్ ఎంఎస్ శ్రీనివాస్, కూచిపూడి కళాక్షేత్ర కార్యదర్శి కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు ఏదో ఒక సంప్రదాయ నృత్యం, సంప్రదాయ కళ నేర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విశాఖ నగరంలోని నాట్య గురువులను సత్కరించారు. అలాగే విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు.



కూచిపూడి నృత్య ప్రదర్శనలో చిన్నారులు